ACCION FRATERNA ecology centre sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం    జనవరి, 2012

FOR PRIVATE CIRCULATION ONLY

## జిల్లాలో వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ రైతుల దుస్థితిని తగ్గించడానికి దశసూత్ర కార్యక్రమం

జనవరి మాసం 18-20 తేదీలలో కేంద్ర ప్రభుత్వం నుండి కరువు అధ్యయన బృందం మన జిల్లాలో పర్యటించింది. జిల్లాలో నాలుగు సంవత్సరాలుగా వరుసగా పంటలు లేకపోవడం పంటల కోసం పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతాంగం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటోంది. పరిస్థితి తీవ్రతను గమనించిన ప్రభుత్వం వ్యవసాయ రంగంలో నిపుణులైన శాస్త్రవేత్తలతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, జిల్లాకు పంపించింది. ఈ బృందం 18, 19 తేదీలు జిల్లాలో వివిధ ప్రాంతాలలో పర్యటించి 20వ తేదీన జిల్లా కేంద్రంలో ప్రజలు, రైతులు, మేధావుల సూచనలను తెలుసుకున్నారు ఆ సందర్భంగా కేంద్ర పరిశీలనా బృందానికి జిల్లాలో కరువు, సంక్షోభ నివారణకు, వ్యవసాయాన్ని బాగుచేయడం కొరకు దశసూత్ర కార్యక్రమాన్ని అమలుపర్చాలని కోరుతూ ఒక విజ్ఞాపన సమర్పించడం జరిగింది. ఆ విజ్ఞాపన పూర్తి పాఠం ఇది.

> ఈ దశ సూత్ర పథకం వ్యవసాయానికి నీటి రక్షణ కల్పించడం ద్వారానూ, ప్రకృతి అనుకూల సుస్థిర వ్యవసాయ పద్ధతుల ద్వారానూ వ్యవసాయ సంక్షోభ నివారణకు ఉద్దేశించబడినది. ముఖ్యంగా దీని ద్వారా వర్షాధార రైతులకు నికరాదాయం, పౌష్టికాహార భద్రత కోసం కూడా సూచించబడింది. అంతేకాకుండా ఈ పథకం ద్వారా వృక్ష సంపద, వర్షపునీటి నిలువ వనరులు, భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయి.

### 1. పరిచయం

గతంలో ప్రతి రెండు, మూడు కరువు సంవత్సరాల తర్వాత ఒక మంచి పంట పండే సంప్రదాయం అనాదిగా ఈ జిల్లా అనుభవంలో ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితులలో పది సంవత్సరాలకు ఒక రెండు పంటలు కూడా రావడంలేదు. ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన భూతాపం ప్రభావం మన జిల్లానే ముందుగా తాకినట్లు స్పష్టంగా కనపడుతున్నది. ఈ జిల్లాలో కురిసే తక్కువ వర్షపాతము కూడా రుతువులు గతి తప్పి భిన్నంగా వర్షాలు కురవడం, పంట అవసరాలకు ప్రతికూలంగా కురవడం, విపరీతంగా మారిన ఋతు ధర్మాల ప్రభావం మనుష్యుల ఆరోగ్యాల మీదనే కాక, పంటల పెరుగుదల, దిగుబడుల మీద వ్యతిరేక ప్రభావాన్ని చూపిస్తున్నాయి.

> **2012 నూతన సంవత్సర శుభాకాంక్షలు**
>
> నూతన సంవత్సర సందర్భంగా రైతులకు, సస్యమిత్ర గ్రూపులకు, గ్రామ సమాఖ్య, మండల సమాఖ్యలకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. కొత్త సంవత్సరంలో రసాయనిక రహిత వ్యవసాయంతో, తక్కువ పెట్టుబడులతో వ్యవసాయాన్ని కాపాడుకుందాం. పంట నష్టాల్ని నివారించు కుందామని నిర్ణయాలు తీసుకుందాం.
>
> **డా॥ వై.వి. మల్లారెడ్డి,**
> డైరెక్టరు, ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

జిల్లా రైతులు సంక్షోభంలో కూరుకుపోయి వున్నారు. వర్షాధార రైతులు వ్యవసాయం ద్వారా తమ జీవనం కొనసాగగలదనే ఆశను వదిలిపెట్టారు. నిరాశ నిస్పృహలతో ఈ రైతులు నిర్మాణం, ఇతర అసంఘటిత రంగాలలో కూలీలుగా పట్టణాలకు వలసపోతున్నారు. వర్షాధార వ్యవసాయం నుంచే నిష్క్రమణలు అధికంగా వున్నాయి. ఇదే విధంగా కొనసాగితే, రాబోయే అయిదు సంవత్సరాలలో 50 శాతం జిల్లా రైతులు వ్యవసాయాన్ని మానివేసి నగరంలోని మురికివాడల్లో చెప్పలేని కష్టతరమైన జీవనాన్ని అనుభవించబోతారు. ఇదొక రైతుల చాలా పెద్దవలసగానూ, రైతుల స్థాయి నుండి సాధారణ కూలీలుగా మార్పు చెందే సామాజిక తిరోగమన పరిణామంగానూ వుండబోతుంది.

#### 1.1 ప్రధానంగా అనంతపురం జిల్లా వ్యవసాయ వాతావరణ పరిస్థితులు

1) తక్కువ సగటు వర్షాపాతం (521 మి.మీ.) జిల్లా అంతటా ఒకే విధంగా ఉండదు. ఆవిరి ద్వారా నష్టపోయేది 1850. చలికాలంలో 12-15 సెంటీగ్రేడ్ కనీసంగానూ 25-33$^0$ అధికంగానూ వుండగా, ఎండాకాలంలో 40-43 సెంటీగ్రేడ్ అధికంగానూ, 26-31 కనీసంగానూ వుంటోంది.
2) 11 లక్షల హెక్టార్ల సాగు భూమిలో 85 శాతం ఎర్ర గరుప నేలలు, 15 శాతం నల్లరేగడి భూములు.
3) దాదాపు 10 లక్షల హెక్టార్లు (90%) సాగు భూమి వర్షాధారం కాగా, కేవలం 10 శాతం భూమికి మాత్రమే నీటిపారుదల సౌకర్యం వుంది. అది కూడా చాలా వరకూ బోర్ల మీదే ఆధారపడింది. (అరకొరగా / ఎండిపోతున్నవి)
4) 7 లక్షల రైతు కుటుంబాలలో 90 శాతం మంది సన్న-చిన్నకారు రైతులే - ముఖ్యంగా దళిత, బడుగు బలహీన వర్గాలు.
5) చిన్న కమతాలు - దాదాపుగా అధిక వాలు, ఎగుడుదిగుడుగా వున్నవి.
6) పచ్చదనంలేని 2 లక్షల హెక్టార్ల అటవీ భూములు వున్నవి.
7) 2 లక్షల హెక్టార్ల రెవిన్యూ భూములలో వంక పోరంబోకులు, చెరువు గర్భాలు తదితరాలలో పచ్చదనం, చెట్లు చేమలు లేకుండా వున్నాయి.

పైన వివరించిన పరిస్థితులలో జిల్లాలో తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం, రైతుల దుర్భర పరిస్థితులు నివారించడానికి నేను దశ సూత్ర కార్యక్రమాన్ని సూచిస్తూ వున్నాను. ఈ దశ సూత్ర పథకాన్ని గనుక యుద్ధ ప్రాతిపదికన పద్ధతి ప్రకారం అమలు చేస్తే, రాబోయే పది సంవత్సరాల లోపల చాలా వరకూ వ్యవసాయ సంక్షోభాన్ని, గ్రామీణ పేదరికాన్ని శాశ్వతంగా నివారించవచ్చును.

### 2.1 కరువు నివారణకు "అనంత జలవలయం" ద్వారా వర్షాధార పంటలకు వరుపులో పంటల రక్షణ (కరువు నివారణ)

ఈ జిల్లాలో వర్షాధారం కింద దాదాపు 10 లక్షల హెక్టార్లలో ముఖ్యంగా వేరుశెనగ మరికొన్ని ఇతర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. సాధారణంగా జూలై, ఆగష్టు మాసాల్లో వేరుశెనగ ఊడలు దిగే సందర్భాలలో ఒక్కోసారి 40 నుంచి 45 రోజుల వరకూ వర్షాలు రాకపోవడం (వరుపు) చేత వేరుశెనగ పంట కరువుకు బలైపోతున్నది. ఇటువంటి సందర్భాలలో వర్షాధార పంటలకు ఒకటి లేదా రెండు తడులు ఇవ్వగలిగితే పంట కరువులను చాలా వరకు నివారించుకోవచ్చును. అనంతపురం జిల్లా నీటి కరువులు అధిగమించడానికి పూర్వీకులు వర్షపు నీటి నిలువ కోసం వేలకొద్దీ చెరువులు, కుంటలు, తలిపిర్లు, సప్లయ్ ఛానల్స్, స్ప్రింగ్ ఛానల్స్ నిర్మించారు. సరైన ఆదరణ, సంరక్షణ లేక అవన్నీ ఇపుడు నిరుపయోగంగా వుంటున్నాయి. వర్షపు నీటి నిలువ కోసం ఈ చిన్న నీటి వనరులన్నింటినీ పునరుద్ధరించాలి. భూమి మీద పడిన వర్షపు నీరు, భూగర్భజలాలు, నదీ జాలల అనుసంధానంతో (Conjuctive use of Water) "అనంత జలవలయం" (Anantapur Water Grid) ఏర్పాటు చేసి, రైతుల అందుబాటులోకి తేవడం ద్వారా పంట నష్టాల్ని నివారించవచ్చును. "అనంతజలవలయం" ఏర్పాటు చేయడానికి అనుసంధాన నీటి వినియోగం తీసుకొని రావడానికి క్రింది చర్యలు చేపట్టవలసి వుంటుంది.

1) సాంప్రదాయక నీటి వనరులైన చెరువులను, కుంటలను పూర్తి సామర్థ్యం స్థాయికి పునరుద్ధరించడం.
2) నీటి పారుదల చెరువులన్నింటినీ ఊట చెరువులుగానూ, నీటి నిలువ చెరువులుగానూ మార్చడం.
3) స్థానికంగా నీటి లభ్యతకు అదనంగా కనీసం 20 టి.ఎమ్.సీ.ల నదీ జలాలను జిల్లాకు సాధించి, సాంప్రదాయ నీటి వనరులను నింపే వ్యవస్థను ఏర్పాటు చేయడం.
4) వర్షాధార భూములకు నీటిని అందించడానికి పైపుల ద్వారా లేదా మొబైల్ స్ప్రింక్లర్ల ద్వారా నీటి పంపిణీ వ్యవస్థను నెలకొల్పడం.
5) డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ద్వారా వర్షాధార భూములకు వరుపు కాలంలో మొబైల్ స్ప్రింక్లర్ల యూనిట్ల ద్వారా (15 మి.మీ) రక్షక తడులు ఇవ్వడానికి ఏర్పాట్లు చేయడం.
6) దీని ద్వారా జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి, భూగర్భ జలాల నుండి కూడా వర్షాధార పంటలకు రక్షక తడులు ఇవ్వడం సాధ్యమవుతుంది.

ఈ రక్షక తడుల పద్ధతి ద్వారా పంట కరువులను నివారించి, లక్షలాది నిరుపేద వర్షాధార రైతులకు శాశ్వతంగా ఉపశమనం కల్గించవచ్చును. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న అనంత జలవలయం ద్వారా జిల్లాలో ప్రాంతాల మధ్య నీటి పంపిణీలో సమతుల్యత అభివృద్ధి చెందుతుంది. జిల్లాలో అన్ని ప్రాంతాలకు నీటి వసతి సమకూరుతుంది. అంతేగాకుండా అధికంగా యస్.సి., యస్.టి., బి.సి. ఇతర చిన్న, సన్నకారు రైతులు లబ్ధి పొందుట ద్వారా సాంఘిక సమతుల్యత కూడా సాధించవచ్చును.

### 2.2 సాగుభూమిలో 33 శాతం వర్షాధార పండ్లతోటలు (Rainfed Horticulture) లు మరియు ఇతర వృక్ష పంటలను (Agro-forestry) పెంపొందించాలి. వృక్ష పంటలు కరువుకు తట్టుకోగలవు మరియు పర్యావరణం అభివృద్ధి చెందుతుంది.

ఈ జిల్లాలోని నేలలు, వాతావరణం పళ్ళ తోటలకు చాలా అనుకూలమైనది. యుద్ధప్రాతిపదికన వర్షాధార పళ్ళతోటలు, ఇతర ఫలవృక్షాలను జిల్లా సాగు భూమిలో 33 శాతం అంటే దాదాపు 4 లక్షల హెక్టార్లలో అభివృద్ధి చేయాల్సి వున్నది. దీని ద్వారా జిల్లాలో తక్కువగావున్న అటవీ వృక్ష సంపదను పూర్తి చేసినట్లుగా కూడా వుంటుంది. వర్షాధారం క్రింద కూడా మామిడి, సపోటా, ఉసిరిక, సీతాఫలం, నేరేడు, సీమ చింతలాంటి పండ్ల మొక్కలను పెంచవచ్చునని 20 సంవత్సరాల నుంచి ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు విజయవంతంగా నిరూపించింది. ఈ పథకం విజయవంతం కావడంతో ప్రభుత్వం కూడా డి.డబ్ల్యు.యం.ఎ. ద్వారా రైతులకు ఈ కార్యక్రమాన్ని అమలు పర్చుతున్నది. అంతేగాక, మేతకోసం, పచ్చిరొట్ట కోసం, ఔషధముల కోసం, కలప కోసం ఇతర అనువైన వృక్ష పంటలను కూడా విస్తృతంగా చేపట్టుటకు అవకాశాలు ఉన్నాయి. దీని ద్వారా నిరుపేద రైతులకు నమ్మకమైన ఆదాయ వనరులు, జీవనోపాధులు ఏర్పడడమే కాకుండా జిల్లాలో శాశ్వత పచ్చదనం ఏర్పడుతుంది. పర్యావరణం అభివృద్ధి చెందుతుంది. మొక్కల పెరుగుదలకోసం, నేల, నీరు సంరక్షణ కార్యక్రమాల్ని అభివృద్ధి పర్చాల్సిన అవసరమున్నది. మొక్కలు నాటినప్పటి నుండి వాటిని సంరక్షించుకుంటూ ఫలసాయం పొందే స్థాయి వరకూ రైతులకు 3 నుండి 5 సంవత్సరములు తగిన విధంగా, నమ్మకంగా ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు ఇవ్వవలసియున్నది. వృక్ష పంటలు ఫలదీకరణ చెందడానికి దాదాపు 2 నుంచీ 5 సంవత్సరాల సమయం పడుతుంది కాబట్టి, రైతులకు ఇచ్చే ప్రోత్సాహకాలు వారిని ఉత్తేజపరిచేవిగా ఉండాలి.

### 2.3 అటవీకరణ మరియు ఉమ్మడి భూముల అభివృద్ధి ద్వారా మేత లభ్యతను పెంపొందించుట. పచ్చదనం పర్యావరణ వనరుల పెరుగుదల ఎడారీకరణను నివారిస్తుంది.

అనంతపురం జిల్లాలో దాదాపు 2 లక్షల హెక్టార్ల అటవీ భూమి వృక్ష సంపద లేకుండా బీడుగా వుంది. అదనంగా మరియొక 2 లక్షల హెక్టార్ల రెవిన్యూ భూమి, గుట్టలు, వంకలు, చెరువులు కూడా వృక్ష సంపద లేకుండా బీడు భూములుగా ఉన్నాయి. ఈ 4 లక్షల హెక్టార్లు ఉమ్మడి వనరులుగా (Common Property Resouce) పేద రైతులకు, వ్యవసాయకూలీలకు ఉపాధి వనరులుగానే కాక జిల్లా ఎడారిగా మారకుండా పచ్చదనం అభివృద్ధి చేయాలి. జిల్లాలో వ్యవసాయం తరువాత అధికంగా ఆధారపడుతున్నది గొర్రెలు, మేకల పెంపకం మరియు పాడి పరిశ్రమ. జిల్లాలో చిన్న జీవాల మేత, నీళ్ళు దొరకక నూర్ల కిలోమీటర్లు దూర ప్రాంతాలకు వలసపోతూ, గొర్రెల పెంపకందార్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పశువులమేత లేమితో రైతులు పశువులను అతి తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. గొర్రెల పెంపకం, పాడిపశువుల పెంపకానికి అవసరమైన మేత లభ్యతను విస్తృతంగా పెంచడానికి 2 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతములోనూ, మరియు 2 లక్షల హెక్టార్ల రెవిన్యూ పరిధిలోని బీడు భూములు, బోడి కొండలలోను గడ్డి మొక్కలను, పళ్ళ చెట్లనూ, మేత చెట్లను, మేతకు మరియు సేంద్రియ ఉత్పత్తికి పనికొచ్చే వృక్ష పంటలను వృద్ధి చేయవలయును. అటవీ ప్రాంతంలో వున్న చెరువులను, కుంటలను కూడా పునరుద్ధరించాలి. అవసరమైన భూసారసంరక్షణ వర్షపు నీటి రక్షణ కార్యక్రమాల్ని చేపట్టాలి. ఈ భూములన్నింటిలోనూ సీతాఫలంలాంటి అడవి (Wild Fruit Trees) పండ్ల చెట్లు, పశువుల మేతకు పనికి వచ్చే తుమ్మ, వేప, చింత, రావి మర్రి లాంటి

చెట్లు నాటించి పచ్చదనం అభివృద్ధి చేయాలి. పరిమిత హక్కులతో గొర్రెలు, పశువుల్ని మేపుకోవడానికి లేదా గడ్డికోసుకొనుటకు రైతులకు అనుమతించాలి. ఈ నాలుగు లక్షల హెక్టార్ల భూములలో పచ్చదనం అభివృద్ధి చేస్తే భూగర్భజలాల మట్టం పెరుగుతుంది. పచ్చదనంతో నేల పరిపుష్టి చెంది ఎడారీకరణ ఆగిపోతుంది.

### 2.4 సమగ్ర వ్యవసాయ వ్యవస్థ (Integrated Farming System) ద్వారా ప్రతి వ్యవసాయాధార రైతు కుటుంబ స్థాయిలో కనీసంగా 100 పళ్ళ చెట్లు, 2 లేక 3 ఆవులు / 10 గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించుట : వృక్ష పంటలు, పశువులు సాంవత్సరిక పంటలకు తోడుగా వుంటాయి.

పంట కరువులకు గురయ్యే ప్రతి వర్షాధార వ్యవసాయ కుటుంబానికి ఒక సమగ్ర వ్యవసాయ వ్యవస్థ పథకం ద్వారా ప్రోత్సహించాలి. తద్వారా ప్రతి కుటుంబ స్థాయిలోనూ కార్తె పంటలను, వృక్ష పంటలను, పశు పెంపకాన్ని అనుసంధానం చేసి, ఒకదానికొకటి తోడుపడేవిధంగా ఒకటి విఫలమైనా మిగిలినవి ఆదుకొనే విధంగా ఆదాయ భద్రత కల్పించాలి. వ్యవసాయ అనుబంధ కార్యక్రమంగా పాడి పశువులు, గొర్రెలు, మేకలు అభివృద్ధి చెందితే వర్షాధార రైతులకు కరువుకు తట్టుకునే పరిస్థితులు ఏర్పడతాయి. వలసలు ఆగిపోతాయి. ఇందుకోసం, దేశవాళీ రకాలైన పశువులను ప్రోత్సహించాలి. ఈ దేశవాళీ రకాలు ఉమ్మడి వనరులైన కొండ గుట్టల వెంబడి, వంకలు, చెరువుల వెంబడి, తిరిగి ఎండు మేత తిని బతక గలిగే స్థానిక రకాలైన పుంగనూరు, తార్పార్కర్, హల్లికార్, ఒంగోలు, సింధీలాంటి కరువు ప్రాంతాలకనువైన పాడి ఆవులను రైతులకు సరఫరా చేయాలి. ఈ పశువులు స్వయంగా కొండ గుట్టలలో తిరిగి మేస్తూ అదనంగా వ్యవసాయ వ్యర్థాలను మేతగా తిని జీవించగలవు. వ్యవసాయానికి అవసరమైన సేంద్రీయ ఎరువును కూడా ఇవ్వగలవు. ఉమ్మడి భూములలో కూడా పశువులు తిరగడం ద్వారా వీటి ఉత్పాదకత కూడా పెరుగుతుంది.

### 2.5 చిరు ధాన్యాలు, పప్పు దినుసుల (Millets & Pulses) మిశ్రమ పంటలను ప్రోత్సహించి, ఆహార భద్రత, పౌష్టికాహార భద్రతను పెంపొందించాలి : స్థానిక రకాల ధాన్యాన్ని ఐ.సి.డి.యస్., మధ్యాహ్న భోజన పథకం, ప్రజా పంపిణీ వ్యవస్థల ద్వారా సరఫరా చేయాలి. ఆహార ధాన్యాల సుదూర రవాణాని తగ్గించాలి.

అనంతపురం జిల్లాలో వేరుశనగ ప్రాధాన్యత పెరగడం చేత చిరుధాన్యపు పంటల విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. దీని ఫలితంగా గ్రామీణ ప్రజానీకం కేవలం ప్రజా పంపిణీ బియ్యం మీదనే ఆధారపడడం చేత పౌష్టికాహార వినియోగం తగ్గి, గ్రామీణ ప్రజలలో రోగ నిరోధక శక్తి తగ్గిపోతున్నది. వేరుశనగ పంట విస్తీర్ణాన్ని తగ్గించి చిరుధాన్యపు పంటలు, పప్పుధాన్యపు పంటలను అంతర పంటలను ప్రోత్సాహించాల్సిన అవసరం వున్నది. అనంతపురం జిల్లాకు అనువైన పంటలు జొన్న, సద్ద, కొర్ర, కంది, అలసంద, నువ్వులు, పెసలు మొదలగు పంటలు. ఈ పంటలు పండించడానికి ప్రభుత్వం నుంచి రైతులకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వవలసియున్నది. చిరుధాన్యాలు పండించే రైతుకు పంట భీమాను, రుణ సౌకర్యము, మద్దతు ధరను ముందుగానే ప్రకటించి, ప్రభుత్వమే పంటలను సేకరించవలయును. ఆ విధంగా సేకరించిన ధాన్యాన్ని స్థానిక వినియోగం కొరకు ICDS కార్యక్రమము, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలతో మధ్యాహ్న భోజన పథకం, ప్రజా పంపిణీ వ్యవస్థల ద్వారా పంపిణీ చేయవచ్చును. దీని ద్వారా నిరుపేదలకు పౌష్టికాహార భద్రత ఏర్పడుతుంది. స్థానిక పంటలను వినియోగంలోకి తేవడం ద్వారా సుదూర ప్రాంతాల నుండి తిండి గింజల రవాణా భారం తగ్గుతుంది. పౌష్టికాహార భద్రత పెరుగుతుంది.

### 2.6 అధిక వ్యవయ హరిత విప్లవ వ్యవసాయం నుండి తక్కువ వ్యయపు సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించుట:

అధిక వ్యయ హరితవిప్లవ వ్యవసాయం (High External Input Sustainable Agriculture, HEIDA) అనంతపురం వ్యవసాయ వాతావరణానికి ఏ మాత్రం సరిపోదు. ముఖ్యంగా వర్షాధార రైతులు మరియు చిన్న-సన్నకారు రైతులు చాలా నష్టపోతున్నారు. అధికంగా రసాయనిక ఎరువుల వాడకంవల్ల వ్యవసాయ పెట్టుబడులు పెరగడంతోపాటు వాతావరణం కలుషితమవుతున్నది. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ముఖ్యంగా వర్షాధార రైతులు చిన్న రైతులు వ్యవసాయం నుండి గెంటివేయబడుతున్నారు. వారు అధిక పెట్టుబడులను భరించలేకున్నారు. అధిక పెట్టుబడుల రసాయనిక వ్యవసాయంవల్ల ప్రజల ఆరోగ్యాలు పాడవడమే కాకుండా నేల, పరిసరాల వాతావరణం కూడా దెబ్బతింటున్నది. అధికంగా రసాయనిక ఎరువుల వాడకం మూలంగా భూమి ఉత్పాదకత కూడా దెబ్బతింటున్నది. కాబట్టి అధిక పెట్టుబడుల రసాయనిక వ్యవసాయం స్థానంలో సుస్థిర తక్కువ పెట్టుబడుల వ్యవసాయాన్ని ప్రోత్సాహించాలి. అధిక పెట్టుబడుల రసాయనిక వ్యవసాయానికి ప్రభుత్వం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ హెక్టారుకు రూ.10,000/- వరకూ రసాయనిక ఎరువుల రూపంలో, యంత్రాల రూపంలో, ఉచిత కరెంటు రూపంలో రాయితీ సమకూరుస్తున్నది. కాబట్టి ప్రభుత్వం అధిక పెట్టుబడుల రసాయన వ్యవసాయం నుండి తక్కువ పెట్టుబడుల రసాయన రహిత సుస్థిర వ్యవసాయ పద్ధతులు ఆచరించే రైతులందరికీ హెక్టారుకు కనీసంగా రూ.7500/- వంతున ప్రోత్సహకాలు ఇవ్వాలి. అప్పుడు రైతులు ప్రత్యామ్నాయ పంటలకు మొగ్గు చూపుతారు. వారికి కావలసిన ఎరువుల్ని వారే తయారు చేసుకుంటారు. జీవ పంట రక్షణ పద్ధతుల్ని అవలంబిస్తారు.

వాతావరణ మార్పులకు తట్టుకునే విధంగా కూడా తక్కువ పెట్టుబడుల సుస్థిర సేంద్రీయ పద్ధతులకు మళ్ళవలసిన అవసరముంది. ఇది ప్రకృతి అనుకూలమైనవే కాకుండా వర్షాధార రైతులకు, వర్షాధార సన్న, చిన్నకారు రైతులకు చాలా ఉపయోగకరంగా వుంటుంది. భూతాపం నుండి గట్టెక్కడానికి కూడా తక్కువ వ్యయ వ్యవసాయం పాటించవలసియున్నది. ఈ పద్ధతి ద్వారా ముఖ్యంగా వర్షాధార రైతులు, చిన్న రైతులు లబ్ధి పొందడమేగాక, పర్యావరణ, భూ ఉత్పాదకత కూడా పెరిగి వాతావరణ మార్పులను కూడా తగ్గిస్తుంది.

### 2.7 వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగ్, పంటలకు అదనపు విలువలు, గిట్టుబాటు ధరలు

జిల్లాలో పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు శ్రేష్ఠతకు, నాణ్యతకు ప్రసిద్ధి. చాలా మంది రైతులు టమోటా, బొప్పాయి, చీనా, దానిమ్మ, సపోటా, జామ, కళింగర, మేడి, ద్రాక్ష, మామిడి లాంటి పంటలతో పాటు వేరుశనగ, శనగ, జొన్న, కందులు లాంటి పంటలను పండిస్తున్నారు. వీటికి సరైన మార్కెటింగ్ విలువ సదుపాయాలు లేక రైతులు విపరీతంగా నష్టపోతున్నారు. ప్రతి మండలంలోనూ శీతల నిలువ గిడ్డంగులు నిర్మించాలి. కనీసంగా మొదటి దశ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలి. రైతు ఉత్పత్తులకు నమ్మకమైన మార్కెటింగ్ సదుపాయం, సేకరణ సదుపాయం కల్పించాలి. వివిధరకాలైన పండ్ల ఉత్పత్తులైన పండ్ల రసం పరిశ్రమలు, టమోట కెచప్ లాంటి పరిశ్రమలు స్థాపించడం ద్వారా వాటి ధరలను స్థిరీకరించడంతోపాటు గిట్టుబాటు ధరలు కూడా లభిస్తాయి.

### 2.8 గ్రామీణ పేదలందరికీ ఆరోగ్యభద్రత

రైతులు, గ్రామీణ పేదలు రుణభారంలో మునిగిపోవడానికి వ్యవసాయ సంక్షోభంతోపాటు దిన దినానికి పెరుగుతున్న ఆరోగ్య ఖర్చులు భరించలేకపోవడమే. కాబట్టి అనంతపురం జిల్లాలోని గ్రామీణులందరికీ

ఆరోగ్యభద్రత కల్పిస్తే గ్రామీణ దుర్భిక్షం గణనీయంగా తగ్గుతుంది. కాబట్టి రాజీవ్ ఆరోగ్యశ్రీని విస్తృతపరచి, అన్ని రోగాలు కలుపుతూ సవరించి అమలు చేయవలయును.

### 2.9 రైతులతో సహా గ్రామీణ పేదలందరికీ విద్యా రాయితీలు

రైతులు, గ్రామీణ పేదలు ఋణభారంలో మునిగి పోవడానికి ఇంకొక ముఖ్య కారణం దినదినానికి పెరుగుతున్న చదువులను "కొనలేక" పోవడమే. వ్యవసాయం సంక్షోభంలో మునిగి, గ్రామాలలో వ్యవసాయంలో భవిష్యత్తు కానరాక, పిల్లలను పైచదువులు చదివించాలనే తపనతో, విద్యాఖర్చులకోసం ఋణగ్రస్థులైపోతున్నారు. కాబట్టి, గ్రామీణ కుటుంబాలకందరికీ నాణ్యమైన చదువులందే విధంగా ఫీజులు చెల్లింపులు, వసతి గృహాలు లాంటి తగిన రాయితీలు కల్పించవలయును. ముఖ్యంగా ప్రభుత్వ విద్యాలయాలలో విద్యా నాణ్యతా ప్రమాణాల్ని పెంచవలసియున్నది. ప్రైవేటు విద్యా సంస్థలలో కూడా నాణ్యతాప్రమాణాలు పెంచే విధంగా చర్యలు చేపట్టవలసియున్నది.

### 2.10 అనంతపురం జిల్లా అభివృద్ధి అయిదు సంవత్సరాల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక

వ్యవసాయంలో సంక్షోభ నివారణ అతి ముఖ్యమైన కార్యక్రమమే కానీ, దీర్ఘకాలిక కవల సమస్యలైన కరువు-దారిద్ర్యం పరిష్కారం కావు. జడలు వేసుకుని పెనవేసుకున్న కరువు-దారిద్ర్యం సమస్యలను పరిష్కరించడానికి విడివిడిగా, పాక్షికంగా చేసే అభివృద్ధి కార్యక్రమాల అమలు అనంతపురం జిల్లాలో ఎడారీకరణను, పేదరికాన్ని నిర్మూలించలేవు. వివిధ రంగాల అభివృద్ధి కార్యక్రమాలను సమీకరించి అమలు పర్చాల్సి వుంటుంది. జిల్లా సర్వతోముఖాభివృద్ధి కోసం అయిదు సంవత్సరాల కాల వ్యవధిగల కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంలో చిన్న, పెద్ద, సూక్ష్మ స్థాయి పరిశ్రమలను నెలకొల్పాలి. యువతకు వ్యవసాయేతర రంగాలలో ఉపాధి నైపుణ్యాన్ని పెంపొందించాలి. మహిళలకు, వ్యవసాయ కూలీలకు అదనపు ఆదాయ వనరులను కల్పించాలి. ఈ కార్యక్రమాలన్నింటికి నిధుల కొరత లేకుండా చాలినన్ని నిధులు జిల్లా యంత్రాంగం ఆధీనంలో వుంచాలి. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పంచాయితీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ పార్టీలు, పౌర ప్రజా వేదికలు కలిసి అభివృద్ధి కార్యక్రమాల్ని విజయవంతం చేయాల్సి వుంటుంది. ఈ కార్యక్రమాల్ని గురుతర బాధ్యతతో, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరముంది.

### ముగింపు

పై కార్యక్రమాలన్నిటిని చిత్తశుద్ధితో ఒక కాల వ్యవధిలో పూర్తి చేయడం ద్వారా అనంతపురం జిల్లాలో కరువు, పేదరికం అనే జంట సమస్యలను చాలా వరకు రూపుమాపగలం.

మన కార్యాచరణ ఇంకేమాత్రం ఆలస్యం కారాదు. బతుకు భారంతో గ్రామీణులందరూ నిరాశా, నిస్పృహలతో పట్టణాలకోసం అదృశ్యం కాకముందే, రైతు స్థాయి నుండి సాధారణ కూలీ స్థాయికి సామాజిక తిరోగమన ప్రయాణం కొనసాగకముందే మేల్కోవాలి.

మీ

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు, అనంతపురం.**

## సేంద్రియ వ్యవసాయం కోసం...

## రైతులు రక్షించుకోవలసిన మొక్క : ఉమ్మెత్త

ఆంధ్రప్రదేశ్ అంతటా రహదారుల ప్రక్కనా, బీడు భూముల్లోనూ ఉమ్మెత్త కలుపు మొక్కగా పెరుగుతుంది. ఈ మొక్క సుమారు రెండు మీటర్ల ఎత్తు వరకు పెరిగే చిన్నపొద. పత్రాలు అండాకారంలో ఉండి, అంచులు కొంచెం పైకి ఉంటాయి. తెల్లని లేదా వంగ పండు రంగులోగల పుష్పాలు, పెద్దవిగా గరాటు ఆకారంలో కొమ్మల చివర ఏర్పడతాయి. ఫలాలు గుండ్రంగా ఉండి ముండ్లతో ఉంటాయి.

ఫలాలు సంవత్సరం పొడవునా లభిస్తాయి. ఈ మొక్క వేర్లు, ఫలాలు, పత్రాలు, పుష్పాలను వైద్యపరంగా ఉపయోగిస్తారు.

### రసాయన పదార్థాలు :

ఉమ్మెత్త మొక్కలో హయోసయోమిన్, అట్రోపైన్, నికోటినమైన్ వంటి అనేక రసాయనాలు (ఆల్కలాయిడ్స్) ఉంటాయి.

### వ్యవసాయంలో ఉమ్మెత్త ఉపయోగాలు :

ఉమ్మెత్త మొక్క ఆకుల కషాయాన్ని ఉపయోగించి పంటలపై వచ్చే పురుగులను (రసం పీల్చే పురుగులు మరియు కాయతొలిచే పురుగులు) సమర్థవంతంగా నివారించవచ్చు. ఉమ్మెత్త ఆకుల కషాయానికి స్పర్శ చర్య మరియు ఉదర చర్య వుంటాయి. అందువల్ల ఈ కషాయం ఒక శక్తివంతమైన కీటకనాశనిగా పనిచేసి పురుగులను అదుపులో ఉంచుతుంది. ఉమ్మెత్త ఆకులను వివిధ ఆకుల ద్రావణం (కీటక నాశని) తయారీలో ఉపయోగించవచ్చు.

1. ఉమ్మెత్త ఆకుల ద్రావణానికి బొద్దింకలను నివారించే గుణాలున్నాయని డా॥ ఖాన్ (అలీఘర్ విశ్వవిద్యాలయం, ఉత్తరప్రదేశ్) పరిశోధనలలో నిరూపితమైనది.
2. దోమల లార్వాలను నిర్మూలించే గుణం ఉమ్మెత్త ద్రావణానికి ఉందని డా॥ పంకజ్‌టాండన్ పరిశోధనలు తెలుపుతున్నాయి.
3. పత్తి పంటలో ఆకులు తినే పురుగుల నివారణకు అమ్రేలీ జిల్లా, (గుజరాత్) రైతులు ఈ క్రింది పద్ధతిని ఉపయోగిస్తున్నారు.

   సుమారు 250-300 గ్రాముల ఉమ్మెత్త ఆకులను మరియు కొమ్మలను చిన్న చిన్న ముక్కలుగా చేసి 1 లీటరు వేడి నీటిలో వేయాలి. తయారైన ద్రావణాన్ని బాగా చల్లారిన తర్వాత 15 లీటర్ల నీటిలో కలిపి పత్తిపంటపై మొక్క తడిసేటట్లు పిచికారి చేయాలి. సుమారు 6-7 గంటల వ్యవధిలో ఆకులు తినే పురుగుల చిన్న చిన్న లార్వాలు నివారించబడతాయి.
4. ఉమ్మెత్త ఆకుల కషాయానికి పంటలో వచ్చే మిడతలను, పండ్లతోటల నాశించు జులుకుల (రెడ్ ట్రీ ఆంట్స్)ను అదుపు చేసే లక్షణాలు వున్నాయని ఇటీవల జరిగిన శాస్త్ర పరిశోధనలలో తేలింది. (తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం, కోయంబత్తూరు)

బహుళోపకారియైన ఉమ్మెత్తను సేంద్రీయ వ్యవసాయంలో సస్యరణ కొరకు రైతులు తప్పనిసరిగా గ్రామాలలో రక్షించుకోవలసిన అవసరం చాలా ఉంది.

(తొలకరి, డిసెంబరు 2011 నుండి)

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in